www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023
5
అన్నమయ్య



## ముస్లిముల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిముల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ జకియా ఖానం అన్నారు. శనివారం రాయచోటిలోని తన నివాసంలో హజ్ దిల్ మే వైయస్సార్ హామ్ సబ్ కే జగన్‌కే సాద్ అనే పేరుతో వైసిపి ముద్రించిన కరపత్రాలను జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లాతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలకు అందుతున్న అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు గురించి కరపత్రాల ద్వారా వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కరపత్రాలు ప్రతి ఒక్క ముస్లిం మైనార్టీ కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. సిఎం జగన్ మైనార్టీల సమగ్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాల ద్వారా లబ్ధి కలిగిస్తున్నారని గుర్తుచేశారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జకియా ఖానం

# 'జగనన్న సురక్ష' పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష్

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రణాళిక బద్ధంగా విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం అంశంలో ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీష పి.ఎస్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి 'జగనన్న సురక్ష' యాప్‌ను విని ద్వారా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 24 నుంచి 30 వరకు పట్టణ, గ్రామ వార్డులలో వాలంటీర్ గృహ సారథులు ఇంటింటికి వెళ్లి కార్యక్రమం పై అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించడంతోపాటు ప్రజా సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని డివిజన్ స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయడానికి అధికారుల బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ సారథ్యంలో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ గిరీష్ పి.ఎస్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి యాప్‌ను ప్రారంభించిన అనంతరం వారం పాటు వాలంటీర్ గృహ సారథులు ఇంటింటికి వెళ్లి అమలవుతున్న పథకాలకు సంబంధించి పౌరులతో చర్చించి సమస్యలను గుర్తించి వాటిని నమోదు చేసుకొని, సదరు వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలపై డిజిటల్ అసిస్టెంట్లు ఈ సర్వీస్ ద్వారా తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జులై 1 నుంచి 22 వరకు సదరు రెండు బృందాలు వారికి కేటాయించిన ప్రతి సచివాలయాన్ని సందర్శించి, ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించాలని చెప్పారు. ప్రతి టీం వారంలో మూడు రోజులు మాత్రమే క్షేత్రస్థాయిలో పర్యటించి, సచివాలయాలను సందర్శించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో ఆయా ఆర్డీవోలు కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా కో -ఆర్డినేటర్ మనోహర్ రాజు, డిపిఒ ధనలక్ష్మి జడ్‌పి కో- ఆర్డినేటర్ రమణారెడ్డి, డిఎస్ఒ రఘురాం, సిఎంఒ కృష్ణా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

### అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

సమస్యల పరిష్కారం కోసం జులై 10వ తేదీన అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవం పురస్కరించుకుని దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలో 10, 11వ తేదీల్లో అన్ని కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. శనివారం జడ్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు నవరత్నాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీరం చేసే విధంగా బడ్జెట్లో నిధులు తగ్గించిదని విమర్శించారు. గర్భిణీలకు, బాలింతలకు, పేదలకు 48 ఏళ్లుగా కార్యకర్తలు, ఆయాలు సేవలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. గౌరవ వేతనంతోనే బతుకుతున్నామని తెలిపారు. కరోనా లాక్ డౌన్ సమయంలో అనేక సేవలు చేశామని మోడి ప్రభుత్వం మమ్మల్ని గుర్తించలేదని చెప్పారు. అంగన్వాడీలకు గ్రాటిటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పాలక ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సెక్టార్, ప్రాజెక్టు సమావేశాలకు పోతే ఇవ్వాల్సిన టిఎ,డి ఎ బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సెంటర్ అద్దెలు జీతాలు కూడా సరిగా ఇవరని చెప్పారు. అంగన్వాడీలకు మెడికల్ సెలవులు ఇవ్వడం లేదని, చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్లను కుదించడం మానుకోవాలని చెప్పారు. రాయలసీమ, కడప జిల్లాలో రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నూనె, కందిపప్పు, గుడ్లు నాణ్యత లోపం ఉందని, అవి కూడా సరిగా ఇవ్వరని తెలిపారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ కార్యకర్తలను అవమానపరిచే తీరును ఖండిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీలకు రావాల్సిన బిల్లు, పోపు సామానులు, అద్దెలు, వేతనాలు సకాలంలో ఇప్పించే వాటిపై శ్రద్ధపెట్టాలని హితవు పలికారు. అంగన్వాడిలు చాలా సహనంతో, ఓర్పుతో ఉన్నామని మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాగే వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబ్బుతామని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు నవరత్నాలు, అమ్మఒడి వర్తింప చేయాలని కోరారు. ప్రీ స్కూల్ పిల్లలకు జగనన్న కిట్ అందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవి, సుప్రజ, రమాదేవి, రాజేశ్వరి, నిర్మల, రేఖ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

## కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతులు బిపిటి 2841 వంటి కొత్త వరి వంగడాలను నాటడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని ఎఒ పవిత్ర తెలిపారు. శనివారం పోలి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిపిటి 2841 వరి వంగడాలను వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధించడమే గాక ఈ రకం వంగడాలలో అధిక ప్రోటీన్లు, ఐరన్, జింక్ కలిగి ఉంటాయని తెలిపారు. ఈదురుగాలులను సైతం తట్టుకునే స్వభావం కలిగి ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారిని జి.రాజకుమారి మాట్లాడుతూ వరిలో కాలిబాటలు, కొనలు తుంచి నాటడం, విత్తన శుద్ధి వంటి పలు అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పి.చెంగల రాయులు, రైతులు పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకానికి ప్రణాళికలు

ప్రజాశక్తి - రాయచోటి


జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా వ్యవసాయ శాఖ మండల సభ్యులు దిన్నెపాడు రవిరాజు పేర్కొన్నారు. శనివారం రాయచోటి సెర్ఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ మద్దిలేటి, జిల్లా వ్యవసాయ శాఖ మండల సభ్యులు దిన్నెపాడు రవిరాజు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ కలెక్టర్ గిరీష జిల్లాను హార్టికల్చర్ హబ్ చేయడానికి డ్వామా సిబ్బందికి ఐదువేల ఎకరాల పైన పండ్లతోటల పెంపకానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నారన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన పండ్ల తోటల పెంపకం తోపాటు అన్ని రకాల బ్లాక్, ఎవెన్యూ ప్లాంటేషన్ల ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి ఉపాధి సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంతోపాటు రైతులు ఆదాయం పొందడం పర్యావరణాన్ని కూడా పరిరక్షించిన వారవుతారన్నారు. అనంతరం పీడీ మద్దిలేటి మాట్లాడుతూ రైతన్న బుధవారం లోపు దరఖాస్తులను ఉపాధి సిబ్బందికి అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడిలు రవికుమార్, రెడ్డయ్య నాయుడు, ప్లాంటేషన్ మేనేజర్ శివవర్మ, ఎపిఒలు, వెలుగు పిఒలు, ఇసిలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులు చిన్ననాటి నుండే ఇతరులతో పోటీపడినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'జగనన్న ఆణిముత్యాలు' ద్వారా ప్రభుత్వం ప్రతిభగల విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. అనంతరం మండల వైసిపి నాయకులు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు విలువ తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతిలో 548 మార్కులతో ప్రథమ స్థానం పొందిన కత్తి సాయి కీర్తనకు రూ. 3 వేలు, 525 మార్కులతో ద్వితీయ స్థానం పొందిన అనంత గాయత్రికి రూ.2 వేలు, 507 మార్కులతో తృతీయ స్థానం పొందిన కేతంరెడ్డి పావనికి రూ.వెయ్యిలను వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులను దుశ్శాలువలతో, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కత్తి బుజ్జిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పీలేరు :** విద్య, వైద్య, వైజ్ఞానిక రంగాల్లో రోజు రోజుకూ వస్తూన్న మార్పులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పోటీ తత్వంతో విద్యను అభ్యసిస్తూ విజయపథంలో నడవాలని సిఐ ఎన్.మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్గదర్శి డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం శనివారం స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐ మోహన్‌రెడ్డి, కుప్పం రేవతి ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ డిజి రామ మూర్తి మాట్లాడుతూ విద్యా రంగంలో వస్తూన్న విప్లవాత్మక మార్పులను అనుసరించి ప్రభుత్వం కూడా విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ విద్య, ఉపాధి రంగాల్లోని అవకాశాలను తమ సామర్థ్యాలకు అనుగుణంగా ఎంచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా చదువులో పోటీ తత్వం చాలా అవసరమని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. సమావేశంలో మార్గదర్శి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.నాగార్జురెడ్డి, ప్రిన్సిపల్ ఎన్.చంద్రశేఖర్ నాయుడు, డైరెక్టర్లు డిఆర్ సుధానందరెడ్డి, పి.జనార్ధనరెడ్డి, ఎస్.చంద్ర శేఖర్, ఎం.లోకేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఐ మోహన్‌రెడ్డి

# నందలూరు రైల్వే అభివృద్ధికి సహకరించండి

### - డిఆర్ఎంకు అఖిలపక్ష నాయకుల వినతి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రం అభివృద్ధికి సహకరించాలని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ వెంకటరమణారెడ్డిని శుక్రవారం రాత్రి అఖిలపక్ష నేతలు కోరారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు డిఆర్ఎంతో మాట్లాడుతూ కరోనా ముందు ఆగుతున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్, దాదర్ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ స్టాపేజ్ కోసం ఉన్నత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. విశాఖపట్నం నుండి కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ వాటరింగ్ కోసం కొండాపురం రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారని, దీనివల్ల రైల్వేకి ఆర్థికంగా ఆదాయం కోల్పోతోందని పేర్కొన్నారు. ఏడు లైన్లు ఉన్న నందలూరులో వాటరింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తే, ఇక్కడి రైల్వే కేంద్రం అభివృద్ధి చెందడంతో పాటు, రైల్వేకి ఆదాయం సమకూరుతుందన్నారు. రైల్వే ప్లాట్‌ఫాం, అరవపల్లె క్రీడా మైదానం ప్రహరీకి మధ్య ఉన్న ఖాళీ స్థలం లోని చెట్లు, డ్రెయినేజీని తొలగించి గ్రౌండ్‌కు సమానంగా లెవెల్ చేసి క్రీడాకారులకు సహకరించాలని కోరారు. సమస్యలు సానుకూలంగా విన్న డిఆర్ఎం చెన్నై నుండి ముంబై, ముంబై నుండి కన్యాకుమారి, కాచిగూడ నుండి తిరుపతి వెళ్లే రైళ్ల నిలుపుదల, రైళ్లలో నీరు పట్టే విషయం, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్షనేతలు మేడా విజయ శేఖర్‌రెడ్డి, పోతురాజు మస్తానయ్య, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, మహేష్, అరిగెల మణి, మండెం నాగరాజు, కొర్లకుంట సుధాకర్, మెహర్ ఖాన్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, హ్యూమన్ రైట్స్ జుల్ఫికర్, చుక్క వెంకటేశ్వర్లు, కాకి చంద్ర, గుగళ్ళ సుబ్బరాయుడు, కానుకుర్తి వెంకటయ్య, కుద్రామణి యాదవ్, పుత్త శంకర్, అరిగె హరి, ఎల్లంరాజుపల్లి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



డిఆర్ఎంతో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు




మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

## భవిష్యత్తుకు భరోసా టిడిపినే :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా టిడిపినేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, యువగళం నిధి కింద 20 లక్షల ఉద్యోగాలు, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం వంటి హామీలతో వైసిపిలో వణుకు పట్టిందని పేర్కొన్నారు. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, ప్రజలకు అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కల్లె రెడ్డప్ప, కొల్లు వెంకటరమణ నాయుడు, కొల్లు రవి నాయుడు, భానుగోపాల్ రాజు, రాయా వెంకటేష్, గుదే నాగార్జున నాయుడు, దామోదర్ నాయుడు, కార్య నిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, సిద్ధవటం మోహన్ రెడ్డి, మిరియాల జ్యోతి, అనసూయమ్మ, ఎర్రంరెడ్డి, కొటికే చలపతి నాయుడు, కోటికి అశోక్ నాయుడు, నిమ్మకాయల సిద్ధమనాయుడు, దుగ్గనపల్లి వెంకటరామిరెడ్డి, చాన్ బాషా బెల్లాల రమణ, సుబ్బరామయ్య, జయరాం నాయక్, ఎల్వి రమణ, ప్రసాద్ రాజు, భాస్కర్ రాజు వెంకటయ్య పాల్గొన్నారు.

## నెహ్రూ పేరు మార్పు గర్హనీయం

**రాజంపేట అర్బన్ :** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్చడం గర్హనీయమని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్రం కోసం తొమ్మిదేళ్లకుపైగా జైలు జీవితం అనుభవించి దేశానికి 16 ఏళ్లపాటు ప్రధానిగా సేవలందించిన నెహ్రూ పేరును మార్చడమంటే స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడమేనని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడం తగదని తెలిపారు. నెహ్రూ ప్రతిష్టను తగ్గించాలని మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. బిజెపి అభద్రత భావానికి, అల్పబుద్ధికి సంకుచితానికి నిదర్శనమన్నారు. నెహ్రూ ప్రతిష్టను తగ్గించాలని ఎవరూ ప్రయత్నం చేసిన వారికే బెడిసి కొట్టుతుందని చెప్పారు. ఇప్పటికైనా నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్పు నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

# రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఎడిఎ




మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.శివశంకర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించేందుకు వీలవుతుందని మదనపల్లె వ్యవసాయ శాఖ సహాయ సంచాలకు కె.శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని సిటిఎం గ్రామంలో రైతులకు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం రసాయన పద్ధతులు లేదా సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయడానికైన అందుబాటులో ఉండే అన్ని వనరులను ఉపయోగించి సమగ్రంగా వ్యవసాయం చేస్తే మంచి దిగుబడులతోపాటు రైతుకు ఆదాయం వస్తుందని తెలిపారు. కెవికె శాస్త్రవేత్త ఎస్.సోమశేఖర్ బాబు మాట్లాడుతూ వేరుశెనగ, వరి పంటలలో కలుపు నీటి యాజమాన్య పద్ధతులు సమగ్ర పోషక యాజమాన్యంపై సమగ్రంగా వివరించారు. శాస్త్రవేత్త వై.పీరు సాహెబ్ మాట్లాడుతూ వరి మరియు వేరుశనగ పంటలలో సమగ్ర సస్యరక్షణ గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్ష యొక్క ప్రాముఖ్యత తెలుపుతూ ప్రతి ఒక్కరు మట్టి నమూనాలు సేకరించి రైతు భరోసా కేంద్రం ద్వారా భూసార పరీక్ష కేంద్రానికి పంపాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలలో ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వి.హెచ్.సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

## ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జూనియర్ కలాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమంటూ, విద్యార్థులే పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలంటూ ఇంటర్ విద్యా శాఖ ఆదేశించడాని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం లేదని తెలిపారు. పాఠ్య పుస్తకాలు అందించకపోతే విద్యార్థులు ఏ రకంగా చదువుకుంటారని ప్రశ్నించారు. మా ప్రభుత్వంలో విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నామంటూ గొప్పగా చెప్పుకోవడమే తప్ప ఆచరణలో అది కనబడటం లేదని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించకపోగా విద్యార్థులు ఫీజులు ద్వారా చెల్లించిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడు-నేడు పథకానికి దారి మళ్లించడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించి, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణతో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, భాష, నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

## మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తోందని మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనుజారెడ్డి, 23వ వార్డు కౌన్సిలర్ గిరిజ సాయిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలులో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, మధ్యాహ్న భోజనం, పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న పారిశుధ్యంపై ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, ఇతర పదార్థాలను అందిస్తున్నారా లేదా అనే దానిపై ఆరాతీశారు. స్థానిక ఉపాధ్యాయులు, ఎంఇఒతోపాటు కౌన్సిలర్, చైర్‌పర్సన్ స్వయంగా భోజనం రుచి చూశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందిస్తుండటంపై వారిని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో జరిగిన ఆణిముత్యాలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2022-23 విద్యా సంవత్సరంలో పాఠశాలలో మొదటి స్థానంలో ఎస్.జాస్మిన్ తాజ్, ద్వితీయ స్థానంలో ఎస్.సానియా, తృతీయ స్థానంలో నిలిచిన అర్షియాలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మనుజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులు మరింతగా విద్యలో ప్రోత్సహించడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఆణిముత్యాలను తీసుకు వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తును అందుకోవడానికి ఇప్పటినుంచే ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జి.నాగ సులోచన, ఎస్‌జిటిలు లీలారత్న కుమారి, ఎస్.తేజోవతి, కె.ప్రపూర్ణ, జి.నిరూప, బి.లావణ్య, ఎస్.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం

ప్రజాదృష్టి

ఉపాధ్యాయులకు బదిలీల బెంగ పట్టుకుంది. ఐదేళ్లు, ఎనిమిదేళ్ల సర్వీసు నిండిన ఉపాధ్యాయులకు బదిలీలు అనివార్యం. ఉమ్మడి కడప జిల్లాలోని 12 వేల మంది ఉపాధ్యాయుల్లో 50 శాతం మందికి బదిలీలు తప్పడం లేదు. కడప జిల్లాలో 3,800 మంది ఉపాధ్యాయులకు బదిలీలు కానున్నట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో బదిలీల ఆప్షన్ ఎంపిక చేయడంలో ఎడిట్ ఆప్షన్ అంశంలో చోటుచేసుకున్న చిన్న పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కంపల్సరీ, టెంపరవరీ బదిలీల అప్షన్ ఎంపిక దగ్గర చోటుచేసుకున్న పొరపాట్లకు సుమారు 40 మంది ఉపాధ్యాయులు భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు కొండాపురం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు బదిలీ ఆప్షన్ దగ్గర చోటుచేసుకున్న తప్పిదానికి నందలూరు మండలం పొత్తపికి బదిలీ అయ్యారు. జిల్లాలో చివరి ప్రాంతం నుంచి అన్నమయ్య జిల్లాలోని మారుమూల ప్రాంతానికి బదిలీ అయ్యారు. చిట్వేలి మండలం నుంచి అట్లూరు మండలం కమలకూరుకు బదిలీ చేశారు. భార్యాభర్తలిద్దరూ ఒకరు చిట్వేలి, మరొకరు అట్లూరు మండలంలోని కమలకూరులో పనిచేయాల్సి వస్తోంది. వీరికి సహజంగా స్పౌస్ కింద బదిలీలు చేయాల్సి ఉండగా, తాజా బదిలీల్లో విరుద్ధ ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తోంది. మరో 30 మంది ఉపాధ్యాయులకు బదిలీల తలనొప్పులు తప్పడం లేదు. స్పష్టమైన గైడ్‌లైన్ విడుదల చేయని నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏమీచేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీ ఆప్షన్ ఎంపిక చేసుకున్న అనంతరం డిఇఒ లాగిన్‌కు చేరుకుంటుంది. డ్రాయింగ్ అధికారి పరిశీలన అనంతరం జిల్లా విద్యాశాఖారి పరిశీలన చేయాల్సి ఉంది. ఇద్దరు ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం బదిలీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వీరిద్దరూ డిఇఒ లాగిన్‌లోని బదిలీల అంశాన్ని పరిశీలన చేయకుండా అప్‌లోడ్ చేయడం ఉపాధ్యాయుల వెతలకు కారణమనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. వృత్తి జీవితంలో పదేళ్లపాటు పనిచేయాల్సిన విషయంలో బదిలీల విషయంలో బాధ్యతారాహిత్యానికి పాల్పడిన అధికారులే తప్పిదానికి బాధ్యత వహించాల్సి ఉందనడంలో సందేహం లేదు. గురుకులం ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెల కొంది. గతంలో కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకున్న ఉపాధ్యాయుల కొనసాగింపు విషయంలో గందరగోళం నెలకొంది. కాంట్రాక్టు ఉపాధ్యాయుల కొనసాగింపు విషయంలో నెలకొన్న స్తబ్దతను తెరదించాల్సి ఉంది. దీనిపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి కొనసాగించేలా చర్యలు తీసుకున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. వీరిలో కొందరి పేర్లు కనిపించకపోవడంతో కాంట్రాక్టు ఉపాధ్యాయుల్లో ఆందోళన తగ్గడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మేడా విజయభాస్కర్‌రెడ్డి

## బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-నందలూరు**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక దేవాలయమైన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి జులై 7 తేదీ వరకు టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం సౌమ్యనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ కరపత్రాలను రాజంపేట డిఎస్‌పి చైతన్య, టిటిడి అధికారి నటేషన్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాళివాహనం, 29న రాత్రి హంసవాహనం, 30న రాత్రి సింహవాహనం, 1న హనుమంత వాహనం, 2న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 3 న ఉదయం సూర్యప్రభ రాత్రికి చంద్ర ప్రభ, 4 న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 5 న రథోత్సవం రాత్రికి అశ్వవాహనం, 6 న చక్రస్నానం రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సిఐ పుల్లయ్య, ఆలయ పాలక మండలి మాజీ అధ్యక్షులు ఆకేపాటి సౌమిత్రి చంద్ర నాథ్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్ అమీర్, నందలూరు సర్పంచ్ మోడపోతుల సుభాషిని, తుమ్మల శ్రీధర్ గౌడ్, కాకి చంద్ర, పెనుబాల నాగసుబ్బయ్య, మోడపోతుల రాము పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాశక్తి-కలికిరి**

మహిళ డిగ్రీ కళాశాల కలికిరిలో అడ్మిషన్లు ప్రారంభం అవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆంజలీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ 2023-24 అకడమిక్ ఇయర్ నుంచి న్యూ ఎడుకేషన్ పాలసీ ద్వారా నాలుగు సంవత్సరాల బ్యాచలర్ డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందులో సింగిల్ మేజర్ సబ్జెక్ట్, సింగిల్ మైనర్ సబ్జెక్ట్ తోపాటు మల్టీ డిసిప్లనరీ, స్కిల్ డెవలప్ మెంట్ పేపర్స్ ఉంటాయని పేర్కొన్నారు. కామర్స్‌లో బి.కాం కంప్యూటర్ అప్లికేషన్ మేజర్ సబ్జెక్ట్ గా, ఎకనామిక్స్ మైనర్‌గా, అలాగే బికాం హానర్స్ (జనరల్) మేజర్‌గా, కంప్యూటర్ అప్లికేషన్ మైనర్‌గా బిఎస్‌సిలో కంప్యూటర్ సైన్స్ మేజర్ గా, మ్యాథ్స్ మైనర్ గా తీసుకొని విద్యార్థి చదవవల్సి ఉంటుందని నూతన అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కళాశాలలో కామర్స్ కు చెందిన బికాం కంప్యూటర్ అప్లికేషన్, బికాం హానర్స్(జనరల్), బిఎస్‌సి (కంప్యూటర్ సైన్స్) ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 23 ప్రాజెక్ట్ 24 వరకు ముగుస్తుందని, స్పెషల్ కేటగిరి వారు వెరిఫికేషన్ కొరకు 21 నుంచి 23 లోపు ఎస్‌వి యూనివర్సిటీకి వెళ్లవలసి ఉంటుందని, నమూనా తప్పకుగా ఉన్నందున అలస్యం చేయకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## శ్రీకృష్ణ గీతా మందిరంలో కుంకుమార్చన

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయితీలో వెలసిన శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈనెల19న సోమవారం వేద పండితులు బండా త్యకారు శివకుమారశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గెలివి నాగరత్నంరెడ్డి, సత్సంగ సభ్యులు నాగిరెడ్డి పల్లి జయన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ గీతా మందిరం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆషాడ మాసం శుద్ధ పాడ్యమి, గోమాతపూజ ప్రసాద్యం గురించి సత్సంగ సభ్యులు జయన్న ప్రవచనాలు ఉంటాయన్నారు. కుంకుమార్చనలో పాల్గొని వచ్చే మహిళలు కాయ కర్పూరం ఇతర పూజా సామాగ్రి వారే సమకూర్చుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

## కథల పోటీలకు ఆహ్వానం

**ప్రజాశక్తి-గుర్రంకొండ**

మలిశెట్టి సీతారామ్ గారి స్మారకార్థం ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ప్రోత్సాహక రచయితల నుంచి కథలను ఆహ్వానిస్తున్నట్లు ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మలిశెట్టి శ్యాంప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుమతి పొందిన కథలతో పాటు మరి కొన్ని ఎంపిక చేసిన కథలతో కథా ప్రపంచం 2023 పుస్తకం ప్రచురించబడుతుందన్నారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అందిస్తారని చెప్పారు. ఏ ప్రాంతంలోని తెలుగువారైనా ఈ కథల పోటీలో పాల్గొనవచ్చని, జులై15 నాటికి కథలను చేర్చాలని సూచించారు. అనువాద రచనలు, అనుసరణలు, ఇతర పోటీలలో ఇప్పటికే పరిశీలనలో ఉన్న కథలను పంపకూడదని చెప్పారు. గతంలో మలిశెట్టి సీతారాం స్మారక కథల పోటీలకు కథలు పంపిన వారు, బహుమతులు పొందిన వారు కూడా ప్రస్తుత కథల పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. కథలు పంపవలసిన వారు పలమనేరు బాలాజీ,పలమనేరు రచయితల సంఘం6/219, గుడియాత్తంరోడ్, పలమనేరు-517408, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పంపంచాలన్నారు. మరిన్ని వివరాలకు బాలాజీ 94409 95010 నంబరును సంప్రదించాలని సూచించారు.

## గ్రామ సమస్యలను పరిష్కరించాలి : ఎంపిడిఒ

**రామాపురం :** గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ ప్రజల సమస్యలను వెంటనే ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పరిష్కరించాలని ఎంపిడిఒ హైదర్‌వలి అన్నారు. స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో శని వారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న నుంచి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆరోజున గ్రామ పరిధిలోని ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలను వాలంటీర్లు గ్రామ సచివాలయ అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. మండల శాఖ అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి మొదటి టీమ్‌కు ఎంపిడిఒ, రెండవ టీమ్‌కు తహశీల్దార్,ఇఒపిఆర్ డిలను ఏర్పాటు చేస్తారన్నారు. వీరికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఆయా సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఇఒపిఆర్‌డి ఉషారాణి, ఆర్‌ఐ రవికుమార్ గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిసిటిఇ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాశక్తి-కురబలకోట**

బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఎపిసిటిఇ చైర్మన్, మృత్యుంజయ్ ప్రొఫెసర్ టిజి సీతారాంను అపెక్స్ ప్రెసిడెంట్ చావ్ గంగిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.శ్రీధర్, మిట్స్ కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి సన్మానించారు. ఈ నెల 30న విజయవాడలో జరిగే అపెక్స్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా రావాలని ఆయనను ఆహ్వానించారు.



# వైసిపితోనే మహిళల ఆర్థికాభివృద్ధి :'చింతల'

**ప్రజాశక్తి-కలికిరి**

వైసిపి తోనే పేదలు, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారని గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల కేంద్రంలోని చీకటి పల్లి గ్రామంలో చీకటపల్లి, రంగనాథ పురం హరిజనవాడలో గడపగడప కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకొని సమస్యలను సంబంధ అధికారులతో అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైసిపి ప్రభుత్వంలో జగనన్న పాలనతో అర్హులకు నేరుగా ఖాతాలో నగదు జమ చేయడం, ఎక్కడా అవినీతికి తావు లేకుండా చేయడం మొట్ట మొదటిసారిగా జగనన్నకే సాధ్యమని తెలిపారు. నిరుపేద మహిళలు ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని రాబోయే కాలంలో కూడా మరొకసారి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంతోకాలంగా భూ సమస్యలతో సతమత మవుతున్న డికెటి రైతులకు సంపూర్ణంగా శాశ్వత హక్కు కల్పిస్తూ జిఒ జారీ చేయడం ఆనంద దాయకమని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, సర్పంచ్ సురేందర్‌రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య యాదవ్, తహశీల్దార్ భాగ్యలత, విద్యుత్‌శాఖ ఎఇ ముజ్బీర్ రహ్మాన్, నాయకులు మధురెడ్డి, సర్పంచ్ రెడ్డివారి వెంకట్ రెడ్డి, మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, వేంపల్లి బావాజి, మహేందర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలోని ముష్టూరు సర్పంచు చంద్రాయుడు ఆధ్వర్యంలో ముష్టురు గ్రామ పరిధిలోని ఎర్రప్పగారిపల్లి, గౌనివారిపల్లిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాడు జగనన్న చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని అన్నారు. నవరత్న పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటిలోని కష్టాలను తీరుస్తున్నారని అన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి కుల మత, రాజకీయాలకతీతంగా అర్హత ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నేరుగా పథకాలను అందిస్తున్నాదని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే అర్హులైన పింఛనుదారులకు అందరికీ పింఛను నగదును వాలంటీర్లు నేరుగా ఇంటికి తీసుకువచ్చి అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో త్రాగునీటి పైపు లైన్లు, మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్రమణ్యం, ఉప సర్పంచు మహమ్మద్‌రఫీ, ఎంపిటిసి వెంకట రమణ, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, నాయకులు సి.వి.రమణ, కొండగాళ్ల రమణ, రాజగోపాల్, నరేంద్రరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, చంద్రమోహన్, ఎంపిడిఒ శేషగిరిరావు, తహశీల్దార్ మంజుల, ఎస్ఐ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

# 'ఆణిముత్యాలకు చిరు సత్కారం'


లక్కిరెడ్డిపల్లి : బహుమతులు ప్రదానం చేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మీరాజ్యం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల కేంద్రంలోని తంబళ్లపల్లె మోడల్‌స్కూల్ , ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం లో భాగంగా పదవ తరగతిలో మొదటి, రెండవ , మూడవ ర్యాంకులు సాధించిన పల్లవి, బి.ఎస్. మైథిలి, కె.వేదశ్రీలను తంబళ్ళపల్లి ఉన్నత పాఠశాలలో ఎద్దుల భవిత, మెహతాజ్, మేఘన లను సత్కరించారు. మొదటి ర్యాంకు సాధించిన పల్లవికి రూ.3వేలు, మైథిలికి రూ.2వేలు, రూపాయలు వేదశ్రీకి వెయ్యి రూపాయలు అందించారు. తంబళ్ళపల్లి ఉన్నత పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన భవితకు రూ.3వేలు, మెహతాజ్‌కు రూ.2వేలు, మేఘనకు వెయ్యి రూపాయలతో పాటు మెడల్స్, సర్టిఫికెట్ బహూకరించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు కూడా పిల్లలతో పాటు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, సర్పంచ్ శ్రీని వాసులు, ఆర్‌బికె చైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, ఎంపిటిసి సరోజమ్మ, , పిఎంసి చైర్మన్ సలీం, సురేష్, ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్లో 2023-24 సంవత్సరానికి గాను పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి మండల అధ్యక్షురాలు సుధామాధురి చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ముగ్గురు విద్యార్థులకు, స్కూల్ కమిటీ చైర్మన్ వై.లక్ష్మీరాజ్యం, ప్రధానోపాధ్యాయులు జగన్మోహినిదేవి, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యులు విజయభాస్కర్ చేతుల మీదుగా, బహుమతులు ప్రదానం చేశారు. 571మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన జి.సుప్రియ రూ.3వేలు, ద్వితీయ బహుమతి ఎ.ఝాన్సీకి రూ.2వేలు, తృతీయ బహుమతి సాధించిన ఎస్.రుమానాకు వెయ్యి రూపాయలు నగదు బహుమతితో పాటు విద్యార్థులందరికి ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. కార్య క్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **రామాపురం :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో మార్కులు సాధించిన విద్యా ర్థులకు గ్రామ సర్పంచ్ ముంగర సరో జమ్మ, మాజీ సర్పంచ్ ముంగర సుబ్బయ్యలు నగదును అందించారు. మండలంలోని గోపగుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మొదటి బహుమతి రేవతికి రూ.3వేలు, ద్వితీయ బహుమతి సి.సంతోష్‌కు రూ.2వేలు, 2 రూపాయలు. తృతీయ బహుమతి చంటికి వెయ్యి రూపాయలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇలియాస్, ఉపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య, మల్లయ్య, బలరాం, వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్ఇసిలో 935 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన హసన్‌ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేతుల మీదుగా రూ.15వేలు నగదును, ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించారు. ఎంఇఒ రెడ్డిశేఖర్, భారతీయ అంబేద్కర్‌సేన (బాస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హసన్ నియోజకవర్గం ప్రతిష్టను పెంచారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు సచిన్, సింగన్న, రామంజి, నక్క మహేష్, పలక వెంకటేష్,చంద్ర శేఖర్, గంగాద్రి, తుపాకుల మణి, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు. **కెవిపల్లి :** మండలం లోని 13 ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, మెడల్స్, ప్రశంసాపత్రలను అందించారు. కార్యక్రమంలోఎంఇఒ రెడ్డి బాషా, కేవిపల్లి మండలం లోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ములకలచెరువు :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఆదర్శ పాఠశాలలో జగనన్న ఆణిము త్యాలు కార్యక్రమాన్ని ఎంఇఒ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు బహుమతి, ప్రశంసా పత్రాలను అందిచారు. కార్యక్రమంలో ఎంపిపి సాయిలీల ఉమామహేష్, మండల కన్వీనర్ మాధవరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు మంత్రి సిద్దారెడ్డి, సర్పంచులు కె.జయచంద్ర కుమార్,రహమత్ బి, ఎంపిటిసి అయేషా చాంద్, పాఠశాల చైర్మన్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పి.కృష్ణారెడ్డి, కవిత, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, ల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కలకడ :** ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు కోసం అడుగులు ముందుకు వేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ కోరారు. శనివారం మండల కేంద్రమైన కలపడం ఆదర్శ పాఠశాల బాటవారిపల్లి జిల్లా పరిస్థితి ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేకమైన పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లంషావలి, ఎంఇఒ మునీంద్రనాయక్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, అమూల్ మేనేజర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-రాజంపేట రూరల్**

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన అనిల్ కుమార్, తిరుపాలమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారికి రాజంపేట నియోజకవర్గం జనసేన యువనాయకులు అతికారి దినేష్ ఆధ్వర్యంలో జనసేన ఎన్ఆర్ఐ కువైట్ సభ్యులు సహకారంతో శనివారం రూ.52 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ జన సైనికులు ఎప్పటికీ సామాజిక సేవ చేయడంలో బాధ్యతగా వ్యవహరిస్తారని తెలిపారు. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కష్టాలలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఆయన అడుగుజాడల్లోనే నడుస్తున్నామని తెలిపారు. జనసేనాని పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లోనే సేవా గుణం కలిగి ఉంటామని పేర్కొన్నారు. పవన్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్య క్రమంలో జనసేన నాయకులు కత్తి సుబ్బరాయుడు, కోలాటంహరి, పోలిశెట్టి శ్రీను, కొండలగారి హరి, గుగ్గిళ్ళ నాగార్జున, బెల్లంపల్లి శ్రీనివాసులు, వీరయ్య ఆచారి, హేమంత్, జానీ పాల్గొన్నారు.

## సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులుగా గంగిరెడ్డి

**ప్రజాశక్తి-ములకలచెరువు**

ములకలచెరువు సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడిగా గంగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శనివారం ఎన్నికల అధికారి ఖాసీం సాబ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగారెడ్డి మౌలాలి, కార్యదర్శిగా మాచిరెడ్డి డైరెక్టర్లుగా నరసింహులు, నాగభూ షణాచారి, బావాజాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గృహరుణాలు, మొండి బకాయిలపై చర్చించారు. సహకార ఘృహనిర్మాణ సంఘం అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని ఎన్నికైన సంఘ సభ్యులు పేర్కొన్నారు

## 'జగనన్న సురక్ష'పై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో కొత్త కార్యక్రమాన్ని తలపెట్టిందని, ఈ కార్యక్రమం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి ఆదేశించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం పై సచివాలయ సిబ్బందికు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమై వచ్చే నెల 23న వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమం పై సచివాలయం, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం పై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులందరు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారుగా మొహమ్మద్ అన్సారి సచివాలయ సిబ్బంది వెల్ఫేర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సెక్రటరీలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

**ప్రజాశక్తి-పీలేరు**

విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదివినప్పుడే విద్యా రంగంలో విజయాలు సాధ్యమని వైసిపి యువ నాయకులు కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతికి జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పీలేరు పట్టణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రథమ బహుమతిగా ఎం.సౌందర్యకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా ఎం.ప్రసన్నకు రూ.10 వేలు ఆయన బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మీకోసం, మీ లక్ష్యం కోసం సమయాన్ని కేటాయించుకుని మెరుగైన ఆలోచనతో చదవాలని అన్నారు. ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు ఈ ప్రోత్సహ నగదు బహుమతులు ప్రతి సంవత్సరం ఇస్తామన్నారు. పాఠశాల సౌలభ్యం కోసం తక్షణ అవసరంగా 10 కుర్చీలు అందజేశారు. తలుపుల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి బాలికకు బలమైన ఆరోగ్యంతోనే మెరుగైన చదువు సాధ్యమని అన్నారు. మంచి పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత, చేతుల శుభ్రత, నిజజీవితంలో మంచి ఫలితాల్ని ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం భార్గవి, మహిళా పోలీసు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.33 లక్షలు కాజేసిన లెక్చరర్

**లక్కిరెడ్డిపల్లి :** కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగుల వద్ద నుంచి రూ.3.33 లక్షలు తీసుకొని ఓ లెక్చరర్ మోసం చేశాడని బాధితుడు దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శాంతయ్య అనే వ్యక్తి దుర్గయ్య అనే నిరుద్యోగ వద్ద నుంచి ఉద్యోగం ఇప్పిస్తారని డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. ఏడాది గడుస్తున్నా ఉద్యోగ విషయం మరిచాడని డబ్బులు అడిగితే నాకు తెలియదని అంటున్నాడని బాధితుడు ఫిర్యాదులు పేర్కొనట్లు చెప్పారు. జాబ్ ఫ్రాడ్ సీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సిఎంకు రుణపడి ఉంటాం

**ప్రజాశక్తి-పీలేరు**

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల కాంటాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదాన్ని హర్షిస్తూ శనివారం స్థానిక వైఎస్ఆర్‌టియుసి కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కన్వీనర్ చిన్నమ్మ, పార్వతి, రాజమ్మ, షహతాజ్, చంద్రకళ, మల్లికార్జున, వైద్య ఆరోగ్య శాఖ నుంచి శివ, రత్నం, వైసిపి నాయకులు వెంకట్రమణా రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ మునీర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం

**ప్రజాశక్తి-నందలూరు**

స్థానిక నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం సందర్భంలో పాఠశాల విద్యా కమిటీ, అధ్యాపక బృందం కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్సిపల్ డి.గంగిరెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కళాశాల ఏర్పాటు చేయడం పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి బాలికలకు ఒక వరమని అన్నారు. అధ్యాపకులు ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సుదూర ప్రాంతాలకు వెళ్ళనవసరం లేకుండానే ప్రభుత్వం జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న బాలికలందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రవిశంకర్ రెడ్డి, మస్తాన్ ,విజయ కుమారి పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతే రైల్వే ధ్యేయం

**ప్రజాశక్తి-నందలూరు**

ప్రయాణికులు, ఉద్యోగుల భద్రతే రైల్వే ధ్యేయమని అందుకు కావలసిన ప్రణాళికలు రచించడమే రైల్వే ముఖ్య ఉద్దేశమని గుంతకల్ రైల్వే మేనేజర్ వెంకటరమణారెడ్డి అన్నారు. నందలూరు రైల్వే కేంద్రంలో, రైల్వే ఉద్యోగులతో సేఫ్టీ ప్రికాషన్స్‌పై సమావేశం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు ముందస్తు ప్రణాళికలు రచించాలని తెలిపారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు తగిన తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డిఈఎన్( కోఆర్డినేషన్) అక్కిరెడ్డి, డీఎస్ఒ చంద్రశేఖర్, డివిజనల్ సేఫ్టీ కౌన్సిలర్స్ విఆర్‌వి నాయర్, దస్తగిరి, డిఇ(పవర్) కృష్ణ, టిఐలు (హెడ్ క్వార్టర్స్) అశోక్ కుమార్, కిరణ్ కుమార్, ఎస్ఎంఆర్ కమలాకర్, ఆర్‌పిఎఫ్ఎస్ఐ చంద్రశేఖర్ నాయక్, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-నందలూరు**


విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం డిఎం హెచ్ఒ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల పరిశీలన చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, సిహెచ్ఒ వెంకటనారాయణ, ఆప్తాలమిక్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి-రామాపురం**

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ముక్కపల్లి నాగేంద్ర, నీలవేణి దంపతుల రెండవ కుమార్తె జాహ్నవి పుట్టినరోజు సందర్భంగా బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శని వారం వృద్ధులకు అన్నదానం చేసినట్లు అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలు,పెళ్లిరోజు వేడుకలకు డబ్బులు వృధా చేయకుండా తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న జాహ్నవికి మా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులందరి తరపున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్, వినోద్‌కుమార్‌నాయక్, దాత కుటుంబసభ్యులు సుశీల, నాగరాజ, భారతి, నరేష్, పవన్, ప్రేమాలయం దేవనాధ్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## డ్రిప్ పైపులు దొంగలించిన ఇద్దరిపై కేసు నమోదు

**కలకడ:** డ్రిప్ పైపులు దొంగలించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడకు చెందిన మిద్దె సయ్యద్‌ఫాజిల్ కు చెందిన సుమారు రూ.18,500 విలువచేసే డ్రిప్ పైపులను గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పంచాయతీ, నల్లగుట్టపల్లికు చెందిన రెడ్డప్ప కుమారుడు రామచంద్ర, సంబేపల్లి మండలం ఎస్ సోమవారం పంచాయతీ అగ్రహారానికి చెందిన రంగీన్ సాహెబ్ కుమారుడు సయ్యద్‌బాషాలు కలిసి స్థానిక గ్యాస్ గోడౌన్ వద్ద ఉన్న డ్రిప్ వైర్లను దొంగలించుకొని వెళ్లారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి వారివద్ద నుంచి డ్రిప్పు పైపులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఎనిమిది మంది పేకాటరాయుళ్లు అరెస్టు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

రహస్యంగా జూదమాడుతున్న ఎనిమిది మంది పేకాటరాయుళ్లు పిటిఎం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ మేరకు వివరాలు..పేకాటపై అందిన ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించమన్నారు. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని టి.సదుం గ్రామానికి పడమరగా గల చింతచెట్టు క్రింద ఎనిమిది మంది ఆరగట్ట రామంజులు, చిన్నమునెప్పగారి కోనప్ప, జర్రాల సురేష్, అగ్రహారం సురేష్, బండార్ల రమేష్, యర్రోల్ల సురేష్, యర్రోల్ల కిట్టన్న, బి.హరీష్ పిటిఎం మండలానికి చెందిన వీరు ఎనిమిది మంది చింత చెట్టు కింద కూర్చొని పేకముక్కల సహాయంతో డబ్బులు పందెంగా పెట్టి లోపల బయట అను మంగతాయి అను జూదం అడుతున్నందున వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5,250 నగదు స్వాధీనం,కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

## సుండుపల్లెలో వ్యక్తి దారుణ హత్య

**ప్రజాశక్తి - సుండుపల్లె**

మండల పరిధిలోని కొండలతూర్పు గ్రామంలో రామాంజనేయరెడ్డి(50) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి రామాంజనేయరెడ్డి అతని భార్య మనోహరి గ్రామంలోని వ్యవసాయ భూముల్లో ఆవులకు మేత వేయడానికి వెళ్లారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్ అనే వ్యక్తి భార్యభర్తలపై దాడి చేశారని చెప్పారు. రామాంజనేయరెడ్డి భార్య మెడలోని బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నంలో ఆమె చేతికి గాయాలయ్యాయన్నారు. పెనుగులాటలో రామాంనేయరెడ్డి గొంతును కోసి హత్య చేశాడని తెలిపారు. రామాంజనేయరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. ఆయన భార్య మనోహరి కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చే లోపే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎస్‌పి గంగాధర్‌రావు, రూరల్ సిఐలు పరిశీలించారు. నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు.